

# భారీగా బీమా క్లెయింల తిరస్కరణ

- 15 వేల కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింలు వెనుకకు
- రూ.1.2 లక్షల కోట్ల క్లెయింల సెటిల్‌మెంట్
- 2023-24 ఆర్థిక సంవత్సరపు నివేదికలో ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: ఆరోగ్య బీమా తీసుకున్నవారికి ఆసుపత్రులు గట్టి షాకిస్తున్నాయి. క్లెయిం సెటిలమెంట్లలో చాలా కొరివిలు పెడుతున్నాయి. దీంతో వేలాది కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింలు తిరస్కరణకు గురవుతున్నాయి. బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ తాజాగా విడుదల చేసిన నివేదికలోనూ ఇదే విషయం స్పష్టమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.15,100 కోట్లు హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింల తిరస్కరించబడ్డాయని తెలిపింది. మొత్తం క్లెయిం సెటిల్‌మెంట్లలో వీటి వాటా 12.9 శాతంగా ఉన్నదని పేర్కొంది. రూ.1.17 లక్షల కోట్ల క్లెయిం సెటిల్‌మెంట్లలో రూ.83,493.17 కోట్లు లేదా 71.29 శాతం చెల్లింపులు జరిపారని తన వార్షికపు నివేదికలో వెల్లడించింది. వీటితో పాటు బీమా సంస్థలు రూ.10,937.18 కోట్ల క్లెయింలను తిరస్కరించగా, రూ.7,584.57 కోట్లు చెల్లింపులు జరుపాల్సివున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 3.26 కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు క్లెయింలుకాగా, వీటిలో 2.69 కోట్లు(82.46 శాతం) చెల్లింపులు జరిగాయి. ఒక్కో క్లెయిం సరాసరి రూ.31,086గా ఉన్నట్లు తెలిపింది. క్లెయిం సెటిల్‌మెంట్లలో 66.16 శాతం క్యాష్‌లెస్ పద్ధతిన సెటిల్ కాగా, 39 శాతం రియంబర్స్‌మెంట్ పద్ధతిన జరిగాయని పేర్కొంది.

- 2023-24లో జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు రూ.1,07,681 కోట్ల ప్రీమియాన్ని వసూలు చేశాయి.
- ప్రస్తుతం 25 జనరల్ ఇన్సూరెన్స్, 8 హెల్త్ ఇన్సూరెన్స్ సేవలు అందిస్తున్నాయి
- ప్రభుత్వరంగ సంస్థలైన న్యూ ఇండియా, నేషనల్ అండ్ ఒరియంటల్ ఇన్సూరెన్సులు హెల్త్ ఇన్సూరెన్స్ బీమా సేవలు అందిస్తున్నాయి.
- గడిచిన ఆర్థిక సంవత్సరంలో 165.05 కోట్ల మంది వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్నారు.
- 90.10 కోట్ల మందికి ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన పథకాలైన ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన్ మంత్రి జన్‌ధన్ యోజన, ఐఆర్‌సీటీసీల కింద బీమా పొందుతున్నారు.

# అదానీ విల్మర్‌కు గుడ్‌బై

పూర్తి వాటాను అమ్మేస్తున్న గౌతమ్ అదానీ

డీల్ విలువ దాదాపు రూ.17,100 కోట్లు

విల్మర్ చేతికి మరో 43.94 శాతం వాటా

ఇక ఎఫ్‌ఎంసీజీ రంగానికి అదానీ గ్రూప్ దూరం






న్యూఢిల్లీ, డిసెంబర్ 30: భారతీయ బహుళ వ్యాపార, పారిశ్రామిక రంగ దిగ్గజం గౌతమ్ అదానీ గ్రూప్.. ఎఫ్‌ఎంసీజీ జాయింట్ వెంచర్ అదానీ విల్మర్ నుంచి తప్పుకుంటున్నది. అందులో ఉన్న మొత్తం వాటాను దాదాపు రూ.17,100 కోట్ల (2 బిలియన్ డాలర్లు)కు అమ్మేస్తున్నట్టు సోమవారం గ్రూప్ ప్రకటించింది. దీంతో ఎఫ్‌ఎంసీజీ రంగానికే అదానీ గుడ్‌బై చెప్పేస్తుండటం గమనార్హం. నిజానికి ప్రతీ రంగంలోనూ ఆయా కంపెనీలను హస్తగతం చేసుకుంటూ తన ఉనికిని విస్తరిస్తూపోతున్న అదానీ గ్రూప్.. ఇలా రెండున్నర దశాబ్దాల చరిత్ర ఉన్న సంస్థను వదులుకుంటూ ఏకంగా ఓ రంగం నుంచే వైదొలుగుతుండటం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నదిప్పుడు.

**1999లో..**

సుమారు 25 ఏండ్ల క్రితం 1999 జనవరిలో సింగపూర్‌కు చెందిన కమొడిటీ ట్రేడర్ విల్మర్‌తో కలిసి అదానీ గ్రూప్ ఈ అదానీ విల్మర్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ప్రస్తుతం అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు 43.94 శాతం వాటా ఉండగా, దీనంతటినీ తమ భాగస్వామి విల్మర్ ఇంటర్నేషనల్‌కే అదానీ గ్రూప్ విక్రయిస్తున్నది. 31.06 శాతం వాటాను రూ.12,314 కోట్లకు అమ్ముతున్న అదానీ.. కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ అవసరాలకు అనుగుణంగా మరో 12.88 శాతం వాటాను ఓపెన్ మార్కెట్‌లో దాదాపు రూ.4,786 కోట్లకు విక్రయిస్తున్నది. కాగా, గౌతమ్ అదానీ, ఆయన సంస్థపై అమెరికాలో లంచం నేరారోపణలు వచ్చిన దగ్గర్నుంచి అదానీ గ్రూప్‌లో జరుగుతున్న బిగ్ డీల్ ఇదే. వచ్చే ఏడాది మార్చి 31కల్లా ఈ లావాదేవీ పూర్తికావచ్చన్న అంచనాలున్నాయి.

- *ఫార్చ్యూన్ బ్రాండ్‌లో వంటనూనె, గోధుమ పిండి, పప్పు ధాన్యాలు, బియ్యం, చక్కెరలను తయారుచేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న అదానీ విల్మర్.*
- ***దేశవ్యాప్తంగా 10 రాష్ర్టాల్లో సంస్థకు 23 ప్లాంట్లున్నాయి.***
- *2022 ఫిబ్రవరిలో రూ.3,600 కోట్లతో వచ్చిన ఐపీవో ద్వారా దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ప్రవేశం.*
- ***ప్రస్తుతం కంపెనీ మార్కెట్ విలువ రూ.42,785 కోట్లు (5 బిలియన్ డాలర్లు).***
- *గత ఆర్థిక సంవత్సరం (2023-24) అదానీ విల్మర్ ఏకీకృత మొత్తం ఆదాయం రూ.51,555.24 కోట్లుగా నమోదు.*

**ఏఈఎల్‌కు దన్ను**

అదానీ విల్మర్‌లో వాటాలను అమ్మేస్తున్న అదానీ గ్రూప్.. ఇలా వస్తున్న నిధులను కీలక మౌలిక వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టబోతున్నది. దీంతో అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్)కు మరింత దన్ను లభించనున్నది. ఎనర్జీ, యుటిలిటీ, రవాణా, లాజిస్టిక్స్ తదితర విభాగాల్లో అదానీ పట్టును పెంచుకోవడానికి ఈ సొమ్మును వాడుకోబోతున్నట్టు కంపెనీ తాజా ప్రకటన ద్వారా తెలియవస్తున్నది. ఫలితంగా ఏఈఎల్ సామర్థ్యం మరింతగా పెరుగుతుందని ఇండస్ట్రీ వర్గాల అంచనా. ముఖ్యంగా విమానాశ్రయాలు, అదానీ డిజిటల్ వంటి వాటిపై ఇంకా శ్రద్ధ పెట్టవచ్చుని కూడా అదానీ గ్రూప్ భావిస్తున్నట్టు ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




## యాపిల్ మొబైళ్లపై విజయ్ ఆఫర్లు

హైదరాబాద్, డిసెంబర్ 30: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ పరికరాల రిటైల్ సంస్థ విజయ్ సేల్స్..యాపిల్ ఉత్పత్తులపై భారీ రాయితీని ప్రకటించింది. వచ్చే నెల 5 వరకు అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ కింద అన్ని రకాల ఐఫోన్లు, మ్యాక్‌బుక్స్, ఐప్యాడ్స్, వాచెస్, ఎయిర్‌పాడ్స్‌లను తగ్గింపు ధరకు విక్రయిస్తున్నది. ఐసీఐసీఐ, ఎస్బీఐ, కొటక్ మహీంద్రా బ్యాంక్ కార్డులపై రూ.3 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్‌ను కలిపిస్తున్నది.

## ఎన్‌ఎండీసీ సీఎండీ పదవీకాలం పొడిగింపు

హైదరాబాద్, డిసెంబర్ 30: ఎన్‌ఎండీసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అమితవ ముఖర్జీ పదవీకాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుతం ఫైనాన్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన.. మరో ఏడాది లేక కొత్త వ్యక్తిని నియమించేవరకు సీఎండీగా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. 1995 ఐఆర్‌ఏఎస్ బ్యాచ్‌కు చెందిన వ్యక్తి ముఖర్జీ.

## ఐకియా నష్టం 1,299 కోట్లు


న్యూఢిల్లీ, డిసెంబర్ 30: ప్రముఖ ఫర్నీచర్ ఉత్పత్తుల విక్రయ సంస్థ ఐకియా ఇండియా భారీ నష్టాలను చవిచూసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,299.40 కోట్ల నష్టం వచ్చింది. ఆదాయం మాత్రం ఏడాదిప్రాతిపదికన 4.5 శాతం ఎగబాకి రూ.1,809.8 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. వ్యాపారాన్ని విస్తరించడానికి అధికంగా నిధులు వెచ్చించడం వల్లనే లాభాల్లో గండిపడిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్, నవీ ముంబై, బెంగళూరులలో అవుట్‌లెట్లు ఉన్నాయి. వీటికోసం ప్రకటనల రూపంలో రూ.196.3 కోట్ల నిధులను వెచ్చించింది.

## 31 వరకు వివాద్ సే విశ్వాస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: పన్ను బకాయిలు, వడ్డీ, జరిమానా మాఫీ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వివాద్ సే విశ్వాస్ స్కీం గడువును జనవరి 31 వరకు పెంచుతూ ఆదాయ మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 31లోపు పన్ను చెల్లింపుదారులు పూర్తిగా తమ బకాయిలు చెల్లించాలని గతంలో ఆదేశించింది. దీంట్లో వడ్డీ, జరిమానాను పూర్తిగా ఎత్తివేస్తున్నారు. సోమవారం కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) తాజా నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. ఫిబ్రవరి 1 నుంచి పన్ను చెల్లింపుదారులు 110 శాతం బకాయిలు, వడ్డీ, జరిమానాతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.

# దేశంలో పెరిగిన సైబర్ మోసాలు

ఆర్బీఐ తాజా నివేదికలో వెల్లడి



ముంబై, డిసెంబర్ 30: దేశంలో సైబర్ మోసాలు పెరిగాయి. డిజిటల్ లావాదేవీలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజా నివేదికే ఇందుకు నిదర్శనం. డిసెంబర్ నెలకుగాను ఆర్థిక సుస్థిరత నివేదిక (ఎఫ్‌ఎస్‌ఆర్) పేరిట సోమవారం ఆర్బీఐ రిపోర్టు విడుదల చేసింది. ఇందులో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్) 18,461 సైబర్ మోసాలు జరిగాయని, వీటి విలువ రూ.21,367 కోట్లని తెలియజేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఇదే వ్యవధిలో 14,480 కేసులు నమోదయ్యాయని, వాటి విలువ కేవలం 2,623 కోట్లేనన్నది. ఈ క్రమంలోనే సైబర్ మోసాల గురించి అందరిలోనూ అవగాహన పెరగాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పింది. అంతేగాక మనీ లాండరింగ్‌కు దారితీసే మ్యూల్ అకౌంట్స్‌ను గుర్తించడం కూడా చాలా ముఖ్యమని పేర్కొన్నది. కాగా, సైబర్ మోసాల బారినపడ్డ బాధితులు ఆర్థికంగా నష్టపోతున్నారని, మానసికంగా కూడా తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారని ఆర్బీఐ ఈ సందర్భంగా ఒకింత ఆందోళన వ్యక్తం చేసింది.

**ఈసారి జీడీపీ 6.6 శాతం**


ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 6.6 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ ఈ సందర్భంగా అంచనా వేసింది. వచ్చే ఏడాది ఆర్థిక వ్యవస్థ మెరుగుపడే అవకాశాలే ఉన్నాయని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు.

**నెఫ్ట్, ఆర్టీజీఎస్‌ల్లో లబ్ధిదారు పేరు**

వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆన్‌లైన్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ వ్యవస్థలైన నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్), రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ (ఆర్టీజీఎస్)ల్లో వినియోగదారులకు లబ్ధిదారు పేరు కనిపించే సదుపాయాన్ని బ్యాంకులు కల్పించనున్నాయి. ఈ మేరకు సోమవారం ఆర్బీఐ ఓ సర్క్యులర్‌ను జారీ చేసింది. ప్రస్తుతం యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), ఇమ్మీడియేట్ పేమెంట్స్ సర్వీస్ (ఐఎంపీఎస్) సిస్టమ్స్‌ల్లోనే ఈ తరహా సౌకర్యం ఉన్నది. నగదు పంపించేవారు ఎవరికైతే పంపిస్తున్నామో వారి పేరును నగదు బదిలీకి ముందే పరిశీలించుకోవచ్చు. దీంతో ఏప్రిల్ 1 నుంచి నెఫ్ట్, ఆర్టీజీఎస్‌ల ద్వారా నగదు బదిలీ చేసేవారికి ఈ అవకాశం రానున్నది.

# ముంచిన బ్లూచిప్‌లు

**సెన్సెక్స్ 451, నిఫ్టీ 169 పాయింట్ల పతనం**



ముంబై, డిసెంబర్ 30: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. బ్లూచిప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ఉండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు వెళ్లిపోవడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. తీవ్ర ఒడిదొడుకుల మధ్య ట్రేడైన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 450.94 పాయింట్లు నష్టపోయి 78,246.13 వద్ద ముగిసింది. 30 షేర్ల ఇండెక్స్‌లో 23 నష్టపోగా, కేవలం ఏడు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మరో సూచీ నిఫ్టీ 168.50 పాయింట్లు కోల్పోయి 23,644.90 వద్ద ముగిసింది. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్ అత్యధికంగా 2.24 శాతం నష్టపోయింది. దీంతోపాటు టైటాన్, టాటా స్టీల్, ఎస్బీఐ, మహీంద్రా, ఎన్‌టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఇన్ఫోసిస్‌లు నష్టపోయాయి. కానీ, జొమాటో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే మెటల్ రంగ సూచీ అత్యధికంగా 2 శాతం వరకు నష్టపోగా, క్యాపిటల్ గూడ్స్ 1.84 శాతం, సర్వీసెస్, ఇండస్ట్రియల్స్, కమోడిటీస్ సూచీలు పతనం చెందాయి. మరోవైపు, రూపాయి గింగిరాలు కొడుతున్నది. రోజుకొక కనిష్ఠ స్థాయికి జారుకుంటున్న విలువ మరో చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దిగుమతిదారుల నుంచి డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి విలువ 4 పైసలు కోల్పోయి 85.52 వద్ద నిలిచింది.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సంస్థ సభ్యులు

## అట్టహాసంగా ముగిసిన నాటకోత్సవాలు

హసన్‌పర్తి, డిసెంబర్ 30 : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ, చలనచిత్ర అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో నిర్వహించిన పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వనం లక్ష్మీకాంతారావు అధ్యక్షతన భీమారంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రాంచందర్‌రావు రచించిన మహారాణి రుద్రమదేవి చరిత్రాత్మక పద్యనాటకాన్ని దేవరాజు రవీందర్‌రావు దర్శకత్వంలో ప్రదర్శించారు. అనంతరం బుర్రకథ కళాకారుడు, రంగస్థలం నటుడు, జిల్లా నాటక సమాజాల అధ్యక్షుడు డాక్టర్ బండారి సుభాష్ యోగా గురువును సంస్థ సభ్యులు సన్మానించారు. కాగా నాలుగో రోజులపాటు నిర్వహించిన నాటకోత్సవాల్లోని సన్నివేశాలను ప్రజలు చూసి మంత్రముగ్ధులయ్యారు. నాటక సమాజాల సమా ఖ్య అధ్యక్షుడు సదానందం, తడకమల్ల రాంచందర్‌రావు, మనోహర్‌రావు, శ్యాంప్రసాద్, రాజమౌళి, సురేశ్, నాగరాజు, రవీందర్, శివసాయి, రామదాసు పాల్గొన్నారు.



ఓనర్స్ కం డ్రైవర్స్‌తో మాట్లాడుతున్న సీఎంహెచ్‌వో రాజారెడ్డి

## ఉద్యోగ భద్రత కల్పించాలని స్వచ్ఛ ఆటో డ్రైవర్ల ధర్నా

వరంగల్, డిసెంబర్ 30 : ఉద్యోగ భద్రత కల్పించాలని స్వచ్ఛ ఆటో ఓనర్స్ కం డ్రైవర్స్ ఆందోళన చేశారు. సోమవారం స్వచ్ఛ ఆటోలను కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట నిలిపి విధులను బహిష్కరించారు. 2014 నుంచి ఓనర్స్ కం డ్రైవర్స్ స్కీంలో భాగంగా 163 మంది స్వచ్ఛ ఆటోలు బ్యాంక్ రుణంతో కొనుగోలు చేసి ఇంటింటి చెత్త సేకరణ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు తమకు ఐడీ కార్డులు, ఈఎస్ఐ సౌకర్యం కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న వారితో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి చర్చలు జరిపారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఓనర్స్ కం డ్రైవర్ల సమస్యపై ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు.

## డిజిటల్ టెక్నాలజీని వినియోగించుకోవాలి

వరంగల్, డిసెంబర్ 30 : విద్యార్థులు డిజిటల్ టెక్నాలజీని వినియోగించుకోవాలని గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ చైర్మన్ చలపతి వెన్నమనేని అన్నారు. సోమవారం నగరంలోని ఏవీవీ ఉన్నత పాఠశాలకు ఆయన సుమారు రూ.1.5లక్షల విలువైన డిజిటల్ ప్రొజెక్టర్‌ను బహూకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, ఏవీవీ విద్యా సంస్థల శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, గండ్ర రమణ, అర్శనపల్లి అనిల్, ఎన్‌ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డిజిటల్ ప్రొజెక్టర్‌ను బహూకరిస్తున్న చలపతి

# ప్రజా సమస్యలపై గళం ఎత్తండి

- కౌన్సిల్ వేదికగా ప్రజల తరఫున పోరాడండి
- బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిలదీయండి
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్




మాటాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్, పక్కన నన్నపునేని తదితరులు

హనుమకొండ, డిసెంబర్ 30 : కౌన్సిల్ వేదికగా ప్రజాసమస్యలపై గళం ఎత్తండి.. ప్రజల తరపున పోరాటం చేయండి అంటూ బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లకు బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ సూచించారు. జీడబ్ల్యూఎంసీ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశంలో దాస్యం వినయ్ భాస్కర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్, నన్నపనేని నరేందర్‌లు మాట్లాడుతూ బల్దియా కౌన్సిల్ వేదికగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిలదీయాలని అన్నారు. స్థానికంగా డివిజన్లో సమస్యల పరిష్కారానికి నిధుల కేటాయింపు కోసం కొట్లాడాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులు పూర్తిచేసేలా అధికారులపై ఒత్తిడి తేవాలన్నారు. నగర ప్రజల కనీస అవసరాలైన నీరు, సీసీ రోడ్లు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, వారి తీరును ఎండగట్టాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు తెలిపేందుకు కౌన్సిల్‌ను వేదికగా మార్చుకోవాలని అన్నారు. కౌన్సిల్లో సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల తరపున బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందన్న విశ్వాసాన్ని ప్రజల్లో నింపాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయినపల్లి రంజిత్‌రావు, చెన్నం మధు, బొంగు అశోక్ యాదవ్, రవినాయక్, రాజు నాయక్, రాధికారెడ్డి, నర్సింగ్, లోహితారాజు, మరుపల్లి రవి పాల్గొన్నారు.

**బల్దియా కౌన్సిల్ సమావేశం మళ్లీ వాయిదా**

వరంగల్ : బల్దియా సర్వసభ్య సమావేశంలో రెండోసారి వాయిదా పడింది. మొదట ఈ నెల 30 నుంచి 31వ తేదీకి వాయిదా వేసిన అధికారులు మళ్లీ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతితో వారం రోజుల పాటు రాష్ట్రంలో సంతాప దినాలు పాటిస్తున్న తరుణంలో మంగళవారం జరగాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు బల్దియా కార్యదర్శి అలివేలు ఒక ప్రకటనలో తెలిపారు. అయితే మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని మాత్రం ప్రకటించలేదు.

## 8 నుంచి తెలంగాణ గోల్డ్ ప్రీమియర్ కప్ క్రికెట్ పోటీలు




మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 30 : జనవరి 8 నుంచి 18 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో తెలంగాణ గోల్డ్ ప్రీమియర్ క్రికెట్ కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు టీసీఏ రాష్ట్ర కోశాధికారి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం హనుమకొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీసీఐ రూల్స్ ప్రకారం 20-20 క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు వయసుతో సంబంధం లేకుండా అందరూ పాల్గొనవచ్చని, రూ.5 వేలు ఎంట్రీ ఫీజు ఉంటుందన్నారు. విన్నర్స్‌కు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.25 వేలు ప్రైజ్‌మనీ ఇస్తామని, హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్, మొగిలిచర్లలో పోటీలను నిర్వహిస్తామన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో ఆరు జిల్లాల టీంలను ఎంపి క చేస్తామని, జనవరి 26 నుంచి హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే తెలంగాణ గోల్డ్ ప్రీమియర్ కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. టీసీఏ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి జయపాల్‌రెడ్డి, టీసీఏ జాయింట్ సెక్రటరీలు మహ్మద్ అలీమ్, సమీ అక్మల్ పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 3న వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహా ప్రదర్శన

హనుమకొండ, డిసెంబర్ 30 : ఎస్సీ వర్గకరణను అమలు చేయాలనే డిమాండ్‌తో మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో వచ్చే ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం వడ్డేపల్లిరోడ్డులోని పల్ల రవీందర్ రెడ్డి భవన్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ కళాకారుల అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం జూపాక శివ మాదిగ అధ్యక్షతన జరిగింది. మందకుమార్ మాదిగ హాజరై మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణను అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలకు అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మాదిగల తిరుగుబాటు ప్రారంభమైందని, దానిలో భాగంగా ఈనెల 3 నుంచి అన్ని మండలాల్లో రథయాత్రలతో తిరుగుతూ ఫిబ్రవరి 3న జరుగే వెయ్యి గొంతులు లక్ష డప్పుల మహా ప్రదర్శనకు మాదిగల పల్లెలను సిద్ధం చేస్తారన్నారు. ఎమ్మెస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న కాపు, బొడ్డు దయాకర్ మాదిగ, గుగ్గిళ్ళ పీరన్న మాదిగ, రాష్ట్ర నాయకులు కొయ్యడ మల్లేశ్ మాది గ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, బిర్రు మహేందర్ మాదిగ, బు చ్చన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శులు ఏకు శంకర్ మాదిగ, దుప్పెల్లి అనిల్ మాదిగ పాల్గొన్నారు.




హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేఎంసీ కార్మికులు

## పెండింగ్ జీతాలు ఇప్పించాలని కేఎంసీ కార్మికుల ధర్నా

హనుమకొండ, డిసెంబర్ 30: తమకు పెండింగ్ జీతాలు ఇప్పించాలని హనుమకొండ కాకతీయ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న హాస్టల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డ్స్, శానిటేషన్ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణిచ శానిటేషన్ వర్కర్లు అల్లం రమేశ్, ప్రశాంత్, శశిధర్, కిషన్, జి రమేశ్, కిషోర్, పరమేశ్, రత్నాకర్, వంశీ, రాజకుమారి, కవిత, రాణి, కోమల, నజియా తదితరులు పాల్గొన్నారు.

## దాడికి పాల్పడిన వారి నుంచి రక్షించాలి



యాదగిరి దంపతులు

వేలేరు, డిసెంబర్ 30: తమపై దాడికి పాల్పడిన వారి నుంచి రక్షణ కల్పించాలని వేలేరు మండలం గుండ్లసాగర్ గ్రామంలోని బాధిత రైతులు నీలం సునీత-యాదగిరి దంపతులు పోలీసులను వేడుకుంటున్నారు. గ్రామానికి చెందిన నీలం యాదగిరి, నీలం కుమార్‌ల మధ్య కొంతకాలంగా భూవివాదం నడుస్తున్నది. కాగా డిసెంబర్ 5న యాదగిరి భార్యను కుమార్ దుర్భాషలాడుతూ, చీర పట్టుకుని లాగి, కర్రతో కొట్టాడని ఆరోపిస్తూ వేలేరు పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా, అతడిపై కేసు నమోదైంది. అయినా కూడా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రేకుల సురేందర్‌రెడ్డి, గాదె వాసురెడ్డి సహకారంతో నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్‌ను తీసుకొచ్చి తమపై ఎక్కించడానికి ప్రయత్నించారని యాదగిరి దంపతులు పేర్కొన్నారు. నీలం కుమార్, అతడి ఇద్దరు కుమారులు దాడికి పాల్పడుతున్నారని, వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరారు. తమకు వారితో ప్రాణహాని ఉందని తెలిపారు.

## అర్ధరాత్రి 12.30 గంటల వరకే న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలి: సీపీ

సుబేదారి, డిసెంబర్ 30 : నూతన సంవత్సర వేడుకలను మంగళవారం అర్ధరాత్రి 12.30 వరకు మాత్రమే జరుపుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ముందస్తుగా స్థానిక పోలీసుల అనుమతి తీసుకోవాలని, నిర్వాహకులు తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అశ్లీల నృత్యాలకు అనుమతి లేదన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం సాయంత్రం నుంచి రోడ్లపై ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, షీటీమ్స్, స్థానిక పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తారని, విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు చేస్తారన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడిన వారికి జరిమానాతో పాటుగా జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఎవరైనా ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని, ఏదైనా సంఘటనలకు పాల్పడితే వెంటనే ప్రజలు 100 కాల్ చేయాలని అన్నారు. ప్రజలు ఇంట్లోనే కుటుంబ సమేతంగా ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కోరారు.



బోయినికుంట సమీపంలో పెద్దపులి ఆచూకీ కోసం గాలిస్తున్న ఎస్సై

## ఇదిగో పులి.. కాదు అదిగో..

*ఫారెస్ట్, పోలీసు అధికారులకు ప్రజల ఫోన్లు*

*డ్రోన్‌తో గాలించినా దొరకని జాడ*

నల్లబెల్లి, డిసెంబర్ 30 : వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు పెద్దపులి భయం నుంచి ఇంకా తేరుకోలేదు. ఇదిగో పులి అంటే.. కాదు అదిగో అంటూ ఫారెస్ట్, పోలీసు అధికారులకు నిత్యం ఫిర్యాదు చేస్తున్నారు. సోమవారం రుద్రగూడెం, పంతులుపల్లె, కొండైల్‌పల్లె, సాయిరెడ్డిపల్లె గ్రామస్తులు తమ పంట పొలాల్లో పెద్దపులి, పులి పిల్ల సంచరిస్తున్నదని అధికారులకు ఫోన్లు చేశారు. దీంతో ఎస్సై గోవర్ధన్ ఆయా ప్రదేశాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. రుద్రగూడెం పరిసర ప్రాంతాల్లో ఫారెస్ట్, పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టి డ్రోన్ కెమెరాలతో చేన్లు చెలకలు, గుట్టలు, బోళ్లు కలియతిరుగుతూ పరిశీలించినా పులి జాడ దొరకలేదు.

## రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం

హనుమకొండ, డిసెంబర్ 30 : రైతు దినోత్సవం సందర్భంగా యువ నేతా జీ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో తలసేమి యా పిల్లల కోసం సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ శిబిరంలో 60 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పీ విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, పుల్లూరి వేణుగోపాల్, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమా ర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు, స్విమ్మర్ రాజు, గుల్లెపల్లి శివ కుమార్, రక్తదాతలు ఈవీ సాత్విక, శ్రావణి, నాగజ్యోతి, చైతన్య, రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ టీ మదన్మోహన్ రావు, సిబ్బంది కరుణశ్రీ, రజాకార్, స్వప్న పాల్గొన్నారు.

## ఎంజీఎం హాస్పిటల్ డైట్ విభాగంలో తనిఖీలు

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 30: ఎంజీఎం హాస్పిటల్‌లో సోమవారం ఏఎంసీ, అత్యవసర విభాగంతో పాటుగా డైట్ విభాగంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్ తని ఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాలు వేడిగా రోగులకు అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వంట చేయడానికి వినియోగించే ఆహార పదార్థాల గడువును ఎప్పటికప్పుడు పరిశీలించాలని డైటీషియన్ రవీందర్‌రెడ్డికి సూచించారు. ఈ తనిఖీల్లో ఆర్‌ఎంఓలు డాక్టర్ మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.